క్లుప్తంగా...

నేడు మెగా వైద్య శిబిరం

మల్కాజిగిరి: హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో కృపా కాంప్లెక్స్ ఎల్‌బీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని బీజేపీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి జిల్లెల రవియాదవ్ తెలిపారు. వైద్య శిబిరాన్ని బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు ప్రారంభిస్తారని ఆయన తెలిపారు.

సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లు షురూ

ఉప్పల్: జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోన్ సమ్మర్ కోచింగ్ క్యాంపులు శనివారం ఉప్పల్ మున్సిపల్ గ్రౌండ్‌లో ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, జోనల్ కమిషనర్ పంకజ, కార్పొరేటర్లు బన్నాల గీత ప్రవీణ్, పన్నాల దేవేందర్‌రెడ్డి, జేరి పోతుల ప్రభుదాస్‌తో కలసి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులచే గౌరవ వందనం స్వీకరించారు. శనివారం నుంచి మే 31వ తేదీ వరకు సమ్మర్ క్యాంపులు ఉంటాయని, యువత వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పల్ సర్కిల్ డీసీ అరుణకుమారి, హయత్‌నగర్ డీసీ మారుతి దివాకర్, సరూర్‌నగర్ డీసీ కృష్ణయ్య, ఈఈ నాగేందర్, స్పోర్ట్ ఇన్‌స్పెక్టర్ వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, వీరానందర్, శ్రీనివాస్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు ఆర్థిక సాయం



కుషాయిగూడ: మీర్‌పేట–హెచ్‌బీకాలనీ డివిజన్ బ్లక్షిగూడకు చెందిన తెలంగాణ ఉద్యమకారురాలు రత్నమాల పెరాలిసిస్ వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న బీఎల్‌ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి ఆదేశానుసారం ట్రస్ట్ ప్రతినిధి గుమ్మడి జంపాల్‌రెడ్డి ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, హరి, గోపాల్‌గౌడ్, రాములు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



కార్పొరేటర్ శ్రీదేవిని కలిసిన రెడ్డికాలనీ అసోసియేషన్ సభ్యులు

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ రెడ్డి కాలనీ అసోసియేషన్ సభ్యులు శనివారం కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని కలిసి కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ పైపులైన్లు వేయాలని వారు ఆమెను కోరారు. రంగారెడ్డి, వెంకట్, రాంరెడ్డి, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, కొండల్‌రెడ్డి, భూంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా టీజేఎస్ ఆవిర్భావ దినోత్సవం



అల్వాల్ పార్టీ కార్యాలయంలో జెండాను ఎగరవేస్తున్న టీజేఎస్ నాయకులు

అల్వాల్: అల్వాల్‌లోని తెలంగాణ జన సమితి కార్యాలయంలో శనివారం తెలంగాణ జన సమితి ఐదో వార్షికోత్సవ వేడుకలను పార్టీ నేతలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.దయాకర్ మాట్లాడుతూ తెలంగాణ జనసమితి బలోపేతానికి అందరూ కృషి చేయాలన్నారు. పార్టీ శ్రేణులు రఘునాథ్, నరసింహ, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి



నాలాను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అధికారులకు సూచించారు. శనివారం పీవీఎస్‌కాలనీ, సత్యరాఘవేంద్రకాలనీ, సెయింట్ ఆన్స్ కాలేజీ ప్రాంతంలో నాలాలను పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఎప్పటికప్పుడు నాలాలను శుభ్రం చేయాలని, మ్యాన్‌హోల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, విఐ రజనీకాంత్, నాయకులు బాబు, సత్యనారాయణ, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మేసిన వాన



జ్యోతినగర్‌లో చెరువును తలపిస్తున్న రోడ్డు

బోడుప్పల్: భారీ వర్షానికి పలు ప్రాంతాలను వరద ముంచెత్తింది. శనివారం ఉదయం కురిసిన వర్షం సాయిభవానీనగర్ కాలనీని ముంచెత్తింది. వరద నీరు ఉధృతం కావడంతో గంగయ్య గార్డెన్ వద్ద ఉన్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగి పారింది. కొంచెం సేపు రాకపోకలకు అంతరాయం కలిగింది.

కాలనీల ప్రజలకు ఇబ్బందులు

గౌతంనగర్: ఇటీవల కురిసిన భారీ వర్షానికి గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరి చెరువును తలపించాయి. జ్యోతినగర్, హనుమాన్‌పేట్, రాజానగర్, రాజా శ్రీనివాసనగర్ తదితర ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి డ్రైనేజీ, వర్షపునీరు రోడ్డుపై మోకాళ్ల లోతుకు చేరింది. దీంతో ఆయా కాలనీలవాసులు ఇబ్బందులు పడ్డారు. వర్షం కురిసిన ప్రతిసారి నరకం అనుభవిస్తున్నామని కాలనీల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. వరద ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీల ప్రజలు కోరారు.

ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రాంగణంలో..

మల్లాపూర్: భారీ వర్షానికి మల్లాపూర్, నాచారం డివిజన్ పరిధిలోని పలు కాలనీలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాలైన మల్లాపూర్ భవానీనగర్, న్యూ భవానీనగర్, గ్రీన్‌హిల్స్ కాలనీ, అన్నపూర్ణ కాలనీ, ఎన్ఎఫ్‌సీ నగర్ కాలనీల్లో వర్షపు నీరు నిలిచింది. నాచారం డివిజన్ పరిధిలోని ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రాంగణంలో నీరు నిలిచి రోగులు ఇబ్బందులు పడ్డారు. నాచారం బాబానగర్, వీఎస్టీ కాలనీ, అంబేడ్కర్‌నగర్, ఎర్రకుంట, రాఘవేంద్రనగర్, ఇందిరానగర్, వీరారెడ్డినగర్‌లో వరద నీటితో ఇబ్బదులు పడ్డారు.



మల్లాపూర్ ఎన్ఎఫ్‌సీనగర్‌లో..



నాచారం ఈఎస్‌ఐ ఆస్పత్రి ప్రాంగణంలో..



నాచారం బాబానగర్ కాలనీ జలమయం

నాలాలో పడిపోయిన కారు

- వ్యక్తికి త్రుటిలో తప్పిన ప్రమాదం
- పనుల్లో నిర్లక్ష్యమే కారణమంటూ.. ఆగ్రహం వ్యక్తం చేసిన వాహనదారులు
- ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి



చెరువులో బోల్తా పడ్డ కారు

రామంతాపూర్: రామంతాపూర్ పెద్ద చెరువు ఎదురుగా ప్రధాన రహదారి వద్ద జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా తవ్విన నాలాలో శనివారం తెల్లవారుజామున ఓ కారు పడిపోయిన ఘటన చోటు చేసుకుంది. వివరాలు.. అమెజాన్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నాగోల్‌కు చెందిన రామ్మోహన్‌రావు(27) అంబర్‌పేట వద్ద తన స్నేహితుడిని ఇంట్లో దిగబెట్టి నాగోల్‌లోని తన ఇంటికి బయలుదేరాడు. రామంతాపూర్ ప్రధాన రహదారిలో పెద్ద చెరువు వద్ద వరద నీటి తొలగింపు కోసం తీసిన భారీ నాలాలో కారు అదుపు పడిపోయింది. వెంటనే అతడిని సురక్షితంగా బయటకు తీసి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, కొన్ని నెలలుగా పనులు సాగుతూనే ఉన్నాయని, వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని పలువురు వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై భారీ ఎత్తున నాలా పనులు జరుగుతున్నప్పుడు ఆ ప్రాంతంలో తగిన రక్షణ చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

కాప్రాలో ఇంటింటికీ సీపీఐ



కాప్రాలో పర్యటిస్తున్న సీపీఐ నేతలు

కాప్రా: ఇంటింటికీ సీపీఐ కార్యక్రమంలో భాగంగా శనివారం కాప్రా డివిజన్‌లోని పలు కాలనీలో సీపీఐ నాయకులు తిరుగుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్.బీస్ మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. పెరిగిన నిత్యావసరాల ధరలు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ప్రజలపై మరింత భారాన్ని మోపుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, లక్ష్మీనారాయణ, నర్సింహ, సాయిలు, యాదగిరి, కృష్ణ, ప్రమీల, ఆశాజ్యోతి, పద్మావతి, సుజాత, లోకేశ్వర్, ఏఐవైఎఫ్ నేత ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఎస్ఆర్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

హబ్సిగూడ: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఆల్ ఇండియా కేటగిరీలలో అఖిల 22వ ర్యాంకు, కార్తీక్ 44వ ర్యాంకు, సాయిధీరజ్ 48 ర్యాంకు, ఎండి.మొయినుద్దీన్ 215వ ర్యాంకు, శ్రావణ్‌కుమార్ 497వ ర్యాంకు, అజయ్ 522వ ర్యాంకు, అంజన్‌కుమార్ 885వ ర్యాంకు, మణిశరణ్ 926వ ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, డీజీఎం.భగవాన్‌రెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ శ్రీనివాస్, జోనల్ ఇన్‌చార్జి కృష్ణగౌడ్, ప్రిన్సిపల్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నాలా వ్యవస్థ అస్తవ్యస్తం



ఎస్ఎండీసీ కాలనీలో నాలాను పరిశీలిస్తున్న నందికంటి శ్రీధర్

మల్కాజిగిరి: మల్కాజిగిరిలో నాలా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. శనివారం ఎస్ఎండీసీ కాలనీలో ఆయన పర్యటించారు. శ్రీధర్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది సంవత్సరాలు గడుస్తున్నా మల్కాజిగిరి నియోజకవర్గంలో నాలాల పరిస్థితి అధ్వాన్నంగా ఉందని, చిన్నపాటి వర్షానికి వరద ఇళ్లలోకి చేరుతోందన్నారు. ప్రజాప్రతినిధుల మాటలు ఆచరణ రూపం దాల్చడం లేదన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, వినోద్‌యాదవ్, బీకే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు రాచకొండ సీపీ ప్రశంసలు



ఉప్పల్ పీఎస్ మహిళా కానిస్టేబుల్ సుమలతకు ప్రశంస పత్రాన్ని అందజేస్తున్న సీపీ డీఎస్ చౌహాన్

ఉప్పల్: అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌కు డయల్ 100కు కాల్ వచ్చిన వెంటనే స్పందించిన ఉప్పల్ పీఎస్ మహిళా కానిస్టేబుల్ సమయస్ఫూర్తిని ప్రశంసిస్తూ రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ప్రశంసా పత్రాన్ని అందజేశారు. వివరాలు.. ఈ నెల 27వ తేది రాత్రి 12.30 గంటలకు ఉప్పల్ పీఎస్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ అలీకి ఒక అనాథ బాలిక రోడ్లపై తిరుగుతోందని డయల్ 100 ద్వారా సమాచారం వచ్చింది. మహబూబ్ అలీ వెంటనే డ్యూటీలో ఉన్న మహిళా కానిస్టేబుల్ జి.సుమలతను అప్రమత్తం చేశారు. కేవలం మూడు నిమిషాల్లోనే ఘటన స్థలానికి చేరుకున్న సుమలత మైనర్ బాలికను షెల్టర్‌కు సురక్షితంగా చేరవేసింది. విచారణలో తల్లి అందురాలని, తండ్రి చనిపోయాడని వివరాలు తెలుసుకుని తల్లిని కూడా షెల్టర్ హోమ్‌కు తరలించింది. సీపీ డీఎస్ చౌహాన్, మల్కాజ్‌గిరి డీసీపీ దారవత్ జానకితో కలిసి మహిళా కానిస్టేబుల్ సుమలతతోపాటు హెడ్ కానిస్టేబుల్ మహబూబ్ అలీని కూడా ప్రశంసిస్తూ శనివారం ప్రశంసా పత్రాలను అందజేశారు.

ఎన్ఆర్ఆర్ జాబ్‌మేళాకు స్పందన



నియామక పత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు

గౌతంనగర్: నిరుద్యోగులకు శనివారం లక్ష్మీసాయి గార్డెన్స్‌లో నిర్వహించిన ఎన్ఆర్ఆర్ జాబ్‌మేళా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన జాబ్‌మేళాలో పాల్గొన్న యువత ఐటీ, నాన్‌ఐటీ, ఫార్మా, విద్యారంగం, తయారీ, హోటల్ మేనేజ్‌మెంట్, ఇండియన్ ఎయిర్‌లైన్స్ తదతర ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొందరికి అప్పటికప్పుడే ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి రాజకీయాలు, ప్రాంతాలకు అతీతంగా జాబ్‌మేళా నిర్వహించామన్నారు. సుమారు 5 వేల మంది పాల్గొన్నారు. వెయ్యి మందికి తక్షణమే ఉద్యోగ ఉత్తర్వులు అందజేశారు. మిగిలిన వారికి త్వరలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, నేతలు మర్రి శశిధర్‌రెడ్డి, ఎన్‌వీ, సుభాష్, హరీష్‌రెడ్డి, భానుప్రకాష్, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మేంద్రస్వామి ఆరాధన ఉత్సవాలు ప్రారంభం

గౌతంనగర్: డివిజన్ పరిధిలోని సంతోష్‌నగర్ కాలనీలోని వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో స్వామివారి 68వ ఆరాధన మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండు రోజులు పాటు జరిగే ఉత్సవాల్లో శనివారం ఉదయం 6 గంటలకు అభిషేకాలు, సుప్రభాతసేవ, మంత్రపుష్పం, తీర్థ ప్రసాదం, 10 గంటలకు యజ్ఞ కార్యక్రమం, సాయంత్రం 7 గంటలకు భజన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అభిషేకాలు, సుప్రభాత సేవ, మంత్రపుష్పం, స్వామివారికి మహా నైవేద్యం, ఆరగింపు, మధ్యాహ్నం 1 గంటకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు స్వామివారి ఊరేగింపు, రాత్రి 9 గంటలకు రాజు బృందం వారి భజన ఉంటుందన్నారు.

పరామర్శ

మౌలాలి: సికింద్రాబాద్ కళాసిగూడ నాలాలో బాలిక(10) పడి మృతిచెందింది. విషయం తెలుసుకున్న వినాయక్ నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. జీహెచ్‌ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల నాలాలో పడి మృత్యువాత పడుతున్నారన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో నాలా పనులను వెంటనే పూర్తి చేయాలని ఆమె కోరారు.



చైన్ స్నాచర్ల అరెస్ట్



మల్కాజిగిరి సీఐని అభినందిస్తున్న సీపీ చౌహాన్

మల్కాజిగిరి: వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ చేసిన ఘటనలో యువకుడిని అరెస్ట్ చేసి, మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. రాచకొండ కమిషనరేట్‌లో జరిగిన సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్ వివరాలు వెల్లడించారు. 26వ తేదీన మీర్జాలగూడకు చెందిన ఎలిజబెత్ జోసెఫ్(69) ఇంటి వద్దకు వచ్చిన ఇద్దరు యువకులు అద్దె ఇంటి సమాచారం కోసం వివరాలు సేకరిస్తూ ఆమె మెడలోని తులం బంగారు గొలుసు కాజేసి బైక్ మీద పరారయ్యారు. ఆమె ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఈ నెల 29వ తేదీ ఉదయం మీర్జాలగూడలో వాహనాల తనిఖీలు చేస్తున్న పోలీసులకు నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించడంతో గొలుసు చోరీ చేసిన విషయం బయటపడింది. షాద్‌నగర్ చటాన్‌పల్లికి చెందిన వలిగి దినేష్(21) అరెస్ట్ చేసి, మైనర్ బాలుడిని జువైనల్ హోంకు తరలించారు. దినేష్ గతంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధి, మహబూబ్‌నగర్ జిల్లాలో ఆరు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడినట్లు తెలిపారు. సీఐ రవికుమార్, డీఐ రవిబాబు, డీఎస్‌ఐ కృష్ణమల్, సిబ్బందిని సీపీ అభినందించారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

ఘట్‌కేసర్: ఇటీవల మరణించిన వారి కుటుంబీకులకు మల్లారెడ్డి ట్రస్ట్ అండగా నిలిచింది. చౌదరిగూడకు చెందిన శోభ, హరీశ్ కుమార్, సుగుణ, లక్ష్మమ్మ, కొర్రెముల్ గ్రామానికి చెందిన లలిత, కలమ్మ, మల్లయ్య, శ్రీనివాస్ కుటుంబీకులను ఆయా గ్రామాల సర్పంచులు బాధితుల ఇంటికెళ్లి పరామర్శించారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున మొత్తం రూ.40 వేలు అందజేశారు.

సమస్య పరిష్కారానికి కృషి



రామాంజనేయనగర్‌లో పర్యటిస్తున్న కార్పొరేటర్ మేకల సునీత రాముయాదవ్

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ మేకల సునీతయాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని రామాంజనేయనగర్‌లో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఇటీవల కురిసిన వర్షానికి డ్రైనేజీలు నిండి రోడ్డుపై నీరు చేరిపోయిందని, దానివల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాలనీ వాసులకు కార్పొరేటర్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్యజ్యోతి, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ నరేందర్, నాయకులు మేకల రాముయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయండి



పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మీనర్సింహ కాలనీలో మౌలిక వసతుల కల్పన కోసం అధికారులపై ఒత్తిడి తేవాలని బీజేపీ పోచారం పురపాలక సంఘ అధ్యక్షుడు నానావత్ సురేష్ నాయక్‌ను కాలనీవాసులు కోరుతూ శనివారం వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ అధికారులతో చర్చించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కాలనీవాసులు తావుర్యానాయక్, వసంత, అరుణ, చందర్, నిర్మల, లలిత, హరిసింగ్ ఉన్నారు.

ప్రమాదకరంగా డ్రైనేజీ వ్యవస్థ



జీఎం సంతోష్‌కు సమస్యలను వివరిస్తున్న కాంగ్రెస్ నేతలు పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

ఉప్పల్: చిలుకానగర్ డివిజన్ మల్లికార్జున నగర్‌లో భయం గుప్పిట్లో ప్రజలు అల్లాడుతున్నారని ఉప్పల్ సర్కిల్ కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తెరిచి ఉన్న మ్యాన్ హోల్స్, నాలాలు ప్రమాదకరంగా మారినా అధికారుల్లో చలనం లేకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు చిలుకానగర్ మల్లికార్జున్ నగర్ పరిస్థితిని వివరిస్తూ శనివారం జలమండలి జీఎం సంతోష్‌ను కాంగ్రెస్ పార్టీ నేతలు కలిశారు. కాలనీ డ్రైనేజీతో స్థానికులు అనేక అవస్థలు పడుతున్నారని వివరించారు. వెంటనే సమస్యలపై స్పందించకపోతే ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కొంపల్లి బాలరాజు, బాకారం లక్ష్మణ్, పల్లె రమేష్‌గౌడ్, అమరేశ్వరి, సుశీల తదితరులు ఉన్నారు.

